క్లుప్తంగా

సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ



వేరుశనగ విత్తనకాయలను సరఫరా చేస్తున్న వ్యవసాయ అధికారులు

పాకాల: రైతులకు సబ్సిడీ ధరలకు వేరుశనగ విత్తనకాయలను సరఫరా చేసినట్లు ఏఓ పుష్పావతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 ఆర్బీకేలలో వేరుశనగ విత్తనకాయలను బయోమెట్రిక్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి అందజేస్తున్నట్లు చెప్పారు. మండలవ్యాప్తంగా 920 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు వచ్చాయన్నారు. రిజిస్టర్ చేసుకున్న రైతులకు 30 కేజీల బస్తాను 40 శాతం రాయితీతో కేవలం రూ.1710లకే అందిస్తున్నట్లు చెప్పారు. వేరుశనగ విత్తనకాయలు పొందిన రైతులు తప్పనిసరిగా పంట సాగు చేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, గీత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

భాకరాపేటలో..

భాకరాపేట : సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ చేపట్టినట్లు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల వ్యవసాయాధికారులు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా తెలిపారు. బుధవారం వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా వేరుశనగ విత్తనాల కావాలిసిన రైతులకు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేశామన్నారు. రెండు మండలాలకు కలపి 1500 క్వింటాల్ వేరుశనగ విత్తనాలు వచ్చాన్నారు. రెండు మండలాల్లో వేరుశనగ విత్తనకాయలు ఒక్క రోజులోనే దాదాపు రైతులు తీసుకెళ్లారని తెలిపారు.

ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్న ఎస్‌ఐ చిరంజీవి

రామచంద్రాపురం: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికే ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్నట్లు ఎస్ఐ చిరంజీవి అన్నారు. బుధవారం మండలంలోని కుప్పంబాదూరు, రాయలచెరువు, మిట్టకండ్రిగ, పరమాల గ్రామాల్లో తన సిబ్బందితో కలసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యంలో కిడ్స్ వెకేషన్ ముగింపు



పతకాలు, ప్రశంసా పత్రాలతో భాష్యం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని భాష్యం పాఠశాలలో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహించిన కిడ్స్ వెకేషన్ వేళ-3 బుధవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా డాక్టర్ రణధీర్‌రాజు హాజరై విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమం ద్వారా సంగీతం, గాత్రం, ఒరిగామి, మ్యాథ్స్, హ్యాండ్ రైటింగ్‌తో పాటు స్విమ్మింగ్, స్కేటింగ్‌లలో శిక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం జెడ్‌ఈఓ లక్ష్మణ్, ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు, నేతాజి, బాలాజీ, ఆంజనేయులు, జెడ్‌సీఓ బింధుమాధవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భావితరాలకు అన్నమయ్య ఆదర్శం

- మనుషులంతా సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు అన్నమయ్య
- శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి



మాట్లాడుతున్న శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: భగవంతుని దృష్టిలో మనుషులంతా సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజికవేత్త అని శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ అన్నమయ్య–సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అన్నివృత్తుల వారు సమానమేనని, రాజు, పేద తేడాలు ఉండకూడదని అందరికీ శ్రీహరే అంతరాత్మ అని అన్నమయ్య తెలియజేశారని చెప్పారు. ఆశ్రమ ధర్మాల్లో గృహస్థాశమ గొప్పతనాన్ని సంకీర్తనల ద్వారా తెలియజేశారన్నారు. పలు సంకీర్తనల్లో రాయలసీమ మాండలికానికి పెద్దపీట వేశారని తెలిపారు. అన్నమయ్య కీర్తనలను చదివినా, విన్నా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. ఈ విషయాలను సాధారణ ప్రజలకు సైతం అర్థమయ్యేలా అన్నమయ్య సంకీర్తనలు రచించారని వివరించారు. అత్యంత సంస్కారవంతంగా శృంగార సంకీర్తనలు రచించి భక్తిభావాన్ని వ్యాప్తి చేశారని తెలిపారు. అన్యమతాలకు చెందిన ప్రభువులు, రాజులు తిరుమల సందర్శించినప్పుడు స్వామివారికి సమర్పించిన కానుకలను తిరుమల కొండపై ఇప్పటికీ చూడవచ్చన్నారు. అనంతరం ఎస్వీయూ అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నమయ్య–జానపదం అనే అంశంపై మాట్లాడుతూ భారతీయ ఆత్మ జానపదంలో ఉందని తెలిపారు. అన్నమయ్య నాటి జనజీవనాన్ని తన సంకీర్తనల్లో ప్రతిబింబింపజేశారన్నారు. అన్నమయ్య సంకీర్తనలు భావితరాలకు ఉపయుక్తంగా ఉంటాయని, సంస్కృతి, సంప్రదాయాలు, ఆనాటి జానపద గేయాలు, జాతీయాలు, మాండికాలు, సామెతలు, పురాణ గాథలను అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలియజేశారని వివరించారు. శ్రీపద్మావతి మహిళావర్సిటీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ యువ అన్నమయ్య– శ్రీకృష్ణతత్వం అనే అంశంపై ప్రసంగించారు. శరణాగతి, లోకనీతి, వేదాల్లోని సారాన్ని కలిపి అన్నమయ్య తన సాహిత్యాన్ని సృష్టించారని తెలిపారు. యావత్ భక్తి సాహిత్యంలో అన్నమయ్యకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. అన్ని మంత్రాల సారం శ్రీవేంకటేశ్వర మంత్రంలో ఉందంటూ స్వామివారిపై ఎనలేని భక్తిని చాటారన్నారు. అన్నమయ్య జీవిత విశేషాలను పరిశీలిస్తే తెలుగునాట భాగవతతోత్తములుగా గుర్తింపు పొందారన్నారు. ఆయన కీర్తనలలో సామాన్య ప్రజలను చైతన్యవంతం చేసేలా, భక్తిభావాన్ని పెంచేలా ఉన్నాయన్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హనుమంతుడు వంటి దేవతలకు ప్రాధాన్యం కల్పించారని వివరించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ విభీషణ శర్మ వక్తలను శాలువా, శ్రీవారి తీర్థప్రసాదాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఘనంగా శ్రీకోదండరాముని ఆస్థానం

అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఉదయం శ్రీకోదండరామస్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులను శ్రీకోదండరామస్వామి వారి ఆలయం



భక్తి సంకీర్తనలు గానం చేస్తున్న వందన

నుంచి అన్నమాచార్య కళామందిరానికి వేంచేపు చేశారు. అన్నమయ్యను విశేష అలంకరణలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు గానం చేశారు. అనంతరం తిరిగి స్వామివారి ఉత్సవమూర్తులను శ్రీకోదండ రామాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన్, సుశీల బృందం చక్కటి సంకీర్తనలతో సుమధురంగా రామున్ని కీర్తించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, కోదండరామస్వామి ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రమణీయం.. వందన గానామృతం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కె.వందన స్వరం నుంచి జాలువారిన మధురమైన స్వర సంకీర్తనా గానం అత్యంత రమణీయంగా సాగుతూ సభికులను మంత్రముగ్దులను చేసింది. అన్నమాచార్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం సాయంత్రం డాక్టర్ వందన బృందం గాత్ర కచేరీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు కొమండూరి శేషాద్రి, శ్వేత సంచాలకుడు భూమన్ సుబ్రమణ్యంరెడ్డి, అనంతపురం ఎస్కేయూ విశ్రాంత వీసీ కుసుమ కుమారి, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, వీజీఓ బాలిరెడ్డి, అధిక సంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.



సంకీర్తనా నీరాజనం అందిస్తున్న కళాకారులు



విశేష అలంకరణలో తాళ్లపాక అన్నమయ్య

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: పాఠశాలలు పునఃప్రారంభం నుంచి మారిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. మెనూ ప్రకారం భోజనం ఏ విధంగా పెట్టాలని వీడియోలను ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు సహాయంతో అవగాహన కల్పించారు. ఎంఈఓ–2 మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల తరువాత మీరే వారికి కావలసిన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచనలు చేశారు. అనంతరం మెనూ ప్రకారం భోజనాలను తయారు చేసి రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మోడల్ కౌంటింగ్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో మూడోవ రోజు మోడల్ కౌంటింగ్ బుధవారంతో ముగిసింది. సోమవారం ప్రారంభమైన ఈ మోడల్ కౌంటింగ్ మూడు రోజుల పాటు నిర్వహించారు. జూన్ 4వ తేదీన తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నారు. ఈ క్రమంలో తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన మోడల్ కౌంటింగ్‌పై పూర్తి అవగాహన కల్పించారు. కౌంటింగ్ సమయంలో ఎలా నిర్వహిస్తారో అదే పద్ధతిలో మోడల్ కౌంటింగ్ చేపట్టారు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీన చేపట్టాల్సిన మోడల్ కౌంటింగ్‌కు ఉద్యోగులను, అధికారులను సిద్ధం చేశారు.

అంకురలో ఐదేళ్ల బాలుడికి అరుదైన చికిత్స



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వైద్యబృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని అంకురా ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్లోకి గ్విలియన్–బార్రే సిండ్రోమ్(జీబీఎస్)తో బాధపడుతున్న 4 ఏళ్ల 8 నెలల బాలుడికి అరుదైన చికిత్స అందించడం ద్వారా నిండు ప్రాణాలు కాపాడారు వైద్యులు. వివరాల్లోకెళ్తే.. గత కొన్ని రోజుల కిందట జీబీఎస్ ఫారింగో–సెర్వికో–బ్రాచియల్ వేరియంట్‌తో బాధపడుతున్న ఐదేళ్ల బాలున్ని అంకుర ఆస్పత్రికి తీసుకురావడం జరిగింది. అడ్మిట్ అయిన తర్వాత పిల్లవాడు క్రిటికల్ కండిషన్‌లో ఉండడంతో వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించగా గ్విలియన్–బార్రే సిండ్రోమ్‌గా నిర్ధారించారు. ఈ మేరకు డాక్టర్ రవిచంద్ర (పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్), మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ దినేష్ రెడ్డి, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ పార్థసారథి(పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్‌లు) మల్టీడిసిప్లినరీ టీమ్ ఆ బాలుడికి అరుదైన చికిత్స అందించారు. దీనిపై విలేకరుల సమావేశంలో డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అంకుర ఆస్పత్రిలో ఎంతో నైపుణ్యం కలిగిన ప్రముఖ పీడియాట్రిక్స్ వైద్యులు ఉండడం వల్లనే ఈ చికిత్స విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ బిడ్డ తమకు దక్కడు అనుకున్న సమయంలో అంకుర ఆస్పత్రి వైద్యులు అంకితభావంతో వైద్యం అందించి ప్రాణాలు కాపాడారన్నారు. కార్యక్రమంలో తిరుపతి అంకుర ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలం.. వసంతోత్సవం





స్వామివారికి వసంతోత్సవ పూజలు, చక్రస్నానం, అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవం కనులపండువగా జరిగింది. ఇందులోభాగంగా ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామివారు కొలువుదీరి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ వేదపండితులు వసంతాలు చల్లుతూ కోలహలంగా నిర్వహించారు. అనంతరం దేవదేవేరులకు ఆలయం వద్ద చక్రస్నానం నిర్వహించారు.ఉదయం నుంచి సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఉయ్యాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు.

నేడు పుష్పయాగ పూజలు..

బ్రహోత్సవాల్లో చివరి రోజు గురువారం సాయంత్రం ఆలయం వద్ద స్వామి, అమ్మవార్లకు పుష్పయాగ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. ఉదయం స్వామివార్ల అభిషేక వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

చక్రస్నానం..పులకించిన భక్తజనం



పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అశేష భక్తులు ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించారు. ఎనిమిది గంటలకు పల్లకిపై స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు చక్రత్తాళ్వార్‌తో కలిసి ఊరేగింపుగా పద్మ సరస్సు వద్దకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్, దేవదేవరులకు పాలు, పెరుగు, తేనె తదితరాల సుగంధ దవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. 10.45 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి, చక్రత్తాళ్వార్‌కు అవభృథస్నానం చేయించారు. ఇదే సమయంలో భక్తులు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

సాయంత్రం 7 గంటలకు విష్వక్సేనుడితో కలిసి స్వామి, అమ్మవార్లు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి, గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహణం చేయించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలు చేశారు. ఈ కార్యక్రమాలను డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ ఏఈ గురుప్రసాద్, అర్జితం అధికారి భరత్, షరాబ్ శ్రీనివాస షనాయ్, రూరల్ సీఐ భాస్కర్ నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా ముగిసిన వసంతోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



వసంత మండపానికి వేంచేస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను వసంత మండపంలోకి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 నుండి 3.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద్య నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోధకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. వీటిని చక్రధార, శంఖధార, సహస్రధార, మహాకలశాభిషేకాలను వైఖానస ఆగమయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రాలు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్య ప్రబంధములో అభిషేక సమయంలో అనుసంధానం చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున మొత్తం ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.